రౌడీషీటర్లపై గట్టి నిఘా

- శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి..
- సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తత..
- ఏసీపీ ఎన్ఎస్‌వీ వెంకటేశ్వర రావు

ఇంటర్వ్యూ



చార్మినార్: పాతబస్తీ దక్షిణ మండలంలోని మీర్‌చౌక్ డివిజన్‌లోని ప్రజలకు రౌండ్ ది క్లాక్ సేవలను అందజేస్తునే..రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతామని మీర్‌చౌక్ డివిజన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్(ఏసీపీ) ఎన్ఎస్‌వీ వెంకటేశ్వర రావు అన్నారు. ఇటీవల మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణలో తమ పోలీసులు నిరంతరం విధినిర్వహణ కొనసాగిస్తున్నారన్నారు. తాను గతంలో పాతబస్తీలో విధినిర్వాహణ కొనసాగించినందున ఇక్కడి సామాజిక పరిస్థితులు,ఏరియాలు,శాంతి భద్రతలు తనకు కొత్తేమి కాదన్నారు. ఇదే మీర్‌చౌక్ డివిజన్‌లో ఎస్ఐగా చేసిన తాను తిరిగి పదోన్నతిపై ఇక్కడికే ఏసీపీగా రావడం జరిగిందని సాక్షికి వివరించారు.

ప్రశ్న: మీరు గతంలో పాతబస్తీలోని ఏ పోలీసు స్టేషన్‌లో పని చేశారు..?

ఏసీపీ : నేను మీర్‌చౌక్ డివిజన్‌లోని రేయిన్ బజార్,డబీర్‌పురా పోలీసు స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశాను.2011 నుంచి 2014 వరకు హబీబ్ నగర్ పోలీసు స్టేషన్‌లో పని చేశాను. 2017లో ఇన్స్‌పెక్టర్ స్థాయి నుంచి డీఎస్‌పీగా పదోన్నతి పొంది సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని పీసీఎస్‌లో పని చేశాను. 2019 నుంచి ఆదిలాబాద్‌లో లా అండ్ ఆర్డర్ డీఎస్‌పీగా..2022 నుంచి రామగుండం సీసీఎస్‌లో డీఎస్‌పీగా చేసి మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీగా బదిలీపై వచ్చాను.

ప్రశ్న: మీ డివిజన్ పరిధిలో ఎన్ని పోలీసు స్టేషన్లున్నాయి..?

జవాబు: మీర్‌చౌక్, రెయిన్‌బజార్,భవానీనగర్ తదితర 3 పోలీసు స్టేషన్లున్నాయి.

ప్రశ్న: శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి..?

జవాబు: ఇప్పటికే నమోదైన రౌడీషీటర్లపై గట్టి నిఘా కొనసాగిస్తున్నాం.సంఘవిద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానికులను కోరుతున్నాం.

ప్రశ్న: మీరు ఎస్ఐగా పని చేసినప్పటికీ..ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రస్తుతం పాతబస్తీలో ఏవైనా మార్పులు కనిపిస్తున్నాయా..?

జవాబు: చాలా మార్పులు వచ్చాయి. అప్పట్లో ఉన్న ఇరుకు ఇరుకు రోడ్ల విస్తరణ జరిగింది. అలాగే పోలీసు శాఖలోని సిబ్బందికి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి పాత పోలీసు భవనాల స్థానంలో అధునాతనమైౖ పోలీసు భవనాలు అందుబాటులోకి వచ్చాయి. శాఖా పరంగా ఎంతో అభివృద్ధి జరిగింది.

ప్రశ్న: డివిజన్ పరిధిలోని ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ..?

జవాబు: శాంతి భద్రతల పరిరక్షణలో స్థానికులు తమతో పూర్తిగా సహకరించాలి. అన్ని వర్గాల ప్రజలు కలసి మెలసి సహజీవనం చేస్తూ శాంతి భద్రతలను కాపాడడంలో ముందుండాలి. ఏ ఉత్సవాలనైనా ఆనందోత్సాహాలతో సమష్టిగా నిర్వహించుకోవాలి. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా వ్యవరిస్తే..కఠినంగా వ్యవహరిస్తాం.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, విద్యుత్ శాఖ ఏడీఈ బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు.

గోల్కొండ సబ్‌స్టేషన్....

ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్షన్ కాలనీ, సమతా కాలనీ, లక్ష్మణ్ నగర్, వాటర్ వర్క్స్ ప్రాంతం, వినాయకనగర్, ఎడ్యుకేర్ పాఠశాల, రెయిన్‌బో హోటల్, జైహింద్ నగర్, డ్రీమ్ వ్యాలీ, ఓయూ కాలనీ, వినోబానగర్, మినీ ఓయూ కాలనీ, భారత్ గ్యాస్, ఇండియన్ గ్యాస్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

మోతీమహల్ సబ్‌స్టేషన్....

ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని కఠోరాహౌస్, గోల్కొండ పోలీస్‌స్టేషన్, దిల్‌వర్ష నగర్, రిసాలా బజార్, నయాఖిల్లా, ఝిన్సీ బజార్, తాకత్ బౌలి, రాఘవమ్మ కంచ, హీరా ఖానా 1, 2, మోతీమహల్, ఖాజీ గల్లి, రేతి గల్లి, గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి, బాలాస్సర్, బడా బజార్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఖుల్సుంపుర ఏసీపీకి సన్మానం



ఏసీపీ ఎంఏ జావిద్‌ను సన్మానిస్తున్న నాయకులు

గోల్కొండ: ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను అదుపు చేయగలుగుతామని ఖుల్సుంపూరా డివిజన్ ఏసీపీ మహ్మద్ అబ్దుల్ జావిద్ అన్నారు. ఖుల్సుంపూరా డివిజన్ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ముత్యాల భాస్కర్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసరి దుర్గరాజు, జే.కృష్ణ, ప్రశాంత్, సాయికిరణ్, శేఖర్, భూపతి, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన.



గోల్కొండ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో పవిత్రమైందని బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డ రాఘవేంద్ర మహిళా మండల్ భవనం వద్ద ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

కేసీఆర్ చిత్రపటానికి రేషన్ డీలర్లు పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

నాంపల్లి: ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించడం పట్ల డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం గన్‌పార్కు వద్ద రేషన్ డీలర్లు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుస్తె శ్రీకాంత్ మాట్లాడుతూ... ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోని రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కారమైనట్లు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వి.శ్రీధర్, క్రిష్ణమూర్తి, మురళి, మోహన్, కుమార్, జానకిరామ్ పాల్గొన్నారు.

భార్యపై దాడికి పాల్పడిన వ్యక్తికి 8 రోజుల జైలు

సంతోష్‌నగర్: మద్యం మత్తులో భార్యపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు వివరాల ప్రకారం... కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంచన్‌బాగ్ ల్యాబ్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన గోక్‌మల్ల అంజయ్య (60), బి. సునీతలు దంపతులు. కాగా గత నెల 31వ తేదీన మద్యం మత్తులో అంజయ్య భార్య సునీత అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీనిపై సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అంజయ్యను అరెస్ట్ చేసి బుధవారం ఈ–పెట్టి కేసు నమోదు చేశారు. అనంతరం అంజయ్యను పోలీసులు బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు అంజయ్యకు 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మీ సేవలు స్ఫూర్తిదాయకం

- డీఎం వెంకట కృష్ణమూర్తి
- 23 మందికి ప్రగతి చక్రం అవార్డుల ప్రదానం

గోల్కొండ: నిర్ణీత లక్ష్యం అధిగమించిన ఆర్టీసీ కార్మికులకు 'ప్రగతి చక్రం' అవార్డులను మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వెంకట కృష్ణమూర్తి బుధవారం ప్రదానం చేశారు. మొత్తం 23 మంది కార్మికుల్లో 10 మంది డ్రైవర్లు, 10 మంది కండక్టర్లు, ముగ్గురు గ్యారేజ్ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా డీఎం వారిని అభినందించారు. విధి నిర్వహణలో కార్యోన్ముఖులై ఉత్తమ ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధిలో మీరు భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావించాలని కోరారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ సిబ్బంది ఎన్నో త్యాగాలు చేశారని, దాని ఫలితంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ సంస్థను రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులను సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించారని గుర్తు చేశారు. మీ కర్తవ్య నిర్వహణ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. సంస్థ పురోభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని అభినందించిన ఆయన.. భవిష్యత్‌లో కూడా ఇలాగే నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. సీఐ ఎన్.నరసింహ మాట్లాడుతూ.. సమష్టికృషితో హైదరాబాద్ రీజియన్‌లో మెహిదీపట్నం డిపోను మొదటి స్థానంలో తీసుకెళుదామని పిలుపునిచ్చారు. కాగా, తమ శ్రమకు ఫలితం దక్కిందని అవార్డులు స్వీకరించిన డ్రైవర్లు, కండక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్రత, ఎంఏ రహ్మాన్, జగన్నాథం, భావన, ధనుంజయ, సత్యనారాయణ డిపో సిబ్బంది పాల్గొన్నారు.



ప్రగతి రథ చక్రం అవార్డులతో ఆర్టీసీ సిబ్బంది

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం



ఆదివాసీ మహిళలతో రాధికా జైస్వాల్

నాంపల్లి: మెట్రోపాలిటన్ న్యాయసేవాధికారాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు బుధవారం నాడిక్కడ ఎస్ఆర్‌నగర్‌లోని బాపూనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాదు కార్యదర్శి రాధికా జైస్వాల్ హాజరయ్యారు. పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు న్యాయపరమైన అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, అమలు పథకం–2015 గురించి విశ్లేషించారు. అలాగే మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ పనితీరును, న్యాయ సేవాధికార సంస్థ వారు అందిస్తున్న సేవలను తెలియజేశారు. అర్హులైన మహిళలు, వృద్ధులకు ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా న్యాయ సేవలు అందిస్తున్నారని, అలాగే మిగతా వారికి మూడు లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి మాత్రమే ఉచిత న్యాయ సేవలు న్యాయసేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు అనంతరెడ్డి, బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు హరిష్ సింగ్ జాదవ్ పాల్గొన్నారు.

విజయ్ కుటుంబానికి న్యాయం చేయాలి



ఉస్మానియా మార్చురీ వద్ద ఆందోళనకు దిగిన బీజేపీ ఎస్సీమోర్చ నాయకులు

అఫ్జల్‌గంజ్: ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న వాగ్వివాదంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు బుధవారం ఆందోళన చేపట్టడంతో ఉస్మానియా మార్చురీ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం....మూసారాంబాగ్ ప్రాంతానికి చెందిన సోలంకి విజయ్(26)కు ఫాజిల్ అనే వ్యక్తితో వాగ్వివాదం చోటుచేసుకుంది. కక్ష పెంచుకున్న ఫాజిల్ విజయ్‌కు ఫోన్‌చేసి అతని భార్యను దూషించాడు. ఈ వ్యాఖ్యలను రికార్డు చేసిన విజయ్ ఫాజిల్‌పై మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్‌స్టేషన్‌కు నాలుగు సార్లు వెళ్లినా మీకేమీ పనిలేదా అంటూ పట్టించుకోకపోవడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని విజయ్ భార్య (8 నెలల గర్భవతి) ఉస్మానియా మార్చురీ ప్రాంగణంతో రోదిస్తూ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీల నాయకులు వచ్చి విజయ్ పార్థివ దేహాన్ని సందర్శించి అతని భార్యను ఓదార్చారు. సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ చిన్న బాల గంగిరెడ్డి, మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్, ఏసీపీ కె.శ్రీనివాస్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సంతోషంలు, ఇతర ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో కలిసి భారీ బందోబస్తును నిర్వహించారు. భారీ బందోబస్తు మధ్య విజయ్ మృతదేహాన్ని బాలాపూర్‌కు తరలించారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



అగర్వాల్ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ సాయి చైతన్య

దబీర్‌పురా: మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోకూడదని మీర్‌చౌక్ ఏసీపీ ఎస్ఎస్‌వి. వెంకటేశ్వర్ రావు సూచించారు. రెయిన్‌బజార్ పీఎస్ పరిధిలోని ఆఫ్రీన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నిషేధిత మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, వైటర్న్ వంటివి ఎవరైనా విక్రయించినట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్సైలు నర్సింహా, పవన్, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్ అన్నారు. శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిస్టల్ పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఏసీపీ జి.రమేష్‌తో కలిసి అదనపు డీసీపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందన్నారు. పోలీసు కేసుల్లో ఇరుక్కొని కుటుంబానికి దూరమవ్వాల్సి వస్తోందన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో శాలిబండ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దూద్‌బౌలి: చట్ట విరుద్ధమైన మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. చార్మినార్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అగర్వాల్ కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... నేటి సమాజంలో అనేక మంది యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని... డ్రగ్స్ వాడకంతో జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతారని.. వాటి విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ , విద్యార్థులు, ప్రిన్సిపాల్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు పాల్గొన్నారు.

గౌలిపురా: నగరంలో డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఛత్రినాక డివిజన్ ఏసీపీ జి. రమేశ్ తెలిపారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరిబౌలిలోని గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మెడికల్ షాపు, స్టేషనరీ దుకాణాల నిర్వాహకులతో డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ బి.పండరీ, ఎస్సై ఎస్. సుమలత తదితరులు పాల్గొన్నారు.

సినారె చిరస్థాయిగా నిలిచి ఉంటారు



మురళీమోహన్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తేజశ్విని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సినీనటుడు మురళీమోహన్‌కు సినారే నటన యశో భూషణ పురస్కారం, గాయకుడు మనోకు జీవిత సాఫల్య పురస్కారంలతో పాటు వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురికి విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు.

ప్రజా దర్బార్‌కు స్పందన



ప్రజల ఫిర్యాదులు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తాను నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో మజ్లిస్ ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. టోలిచౌకీ మిరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు డివిజన్‌ల నుంచి వచ్చిన వారు ఆయనకు తమ ఫిర్యాదులు అందించారు. మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల ఆర్థిక పథకం గడువును పెంచాలని ఆయనను కోరారు. అదే విధంగా ముస్లిం నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పన కోసం ఎటువంటి పూచికత్తు లేకుండా సబ్సిడీపై రుణాలు ఇప్పించాలని పలువురు ఆయనను కోరారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీముద్దీన్ తదితరులున్నారు.

సీఐ జగన్నాథంకు సత్కారం



నాంపల్లి: పోలీసు కంట్రోల్ రూమ్ ప్రాంగణంలోని మధ్యమండలం మహిళా పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జగన్నాథంను బుధవారం మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజలింగం, బన్నప్ప, వల్లయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం.



బండ్లగూడ మండల నూతన తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన జయమ్మను మజ్లిస్ నాయకులు సన్మానించారు. బార్కాస్ డివిజన్‌కు చెందిన తల్హా కసేరీ ఈ మేరకు పూల మాల అందజేసి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములు కబ్జా బారిన పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ చిత్రాపటానికి పాలాభిషేకం

యాకుత్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు పట్ల హైదరాబాద్ రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రా పటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ రేషన్ డీలర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వీరేశం ముదిరాజ్, ప్రధాన కార్యాదర్శి ప్రసాద్ గౌడ్, కోశాధికారి డీ. రాంకోటీలు మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణమన్నారు. కార్యక్రమంలో అసోషియోషన్ సభ్యులు, సర్కిల్ -02 యాకుత్‌పురా డీలర్ల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

లంగర్‌హౌస్: ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ అర్హులు లబ్ధి పొందేలా కృషి చేస్తానని గోల్కొండ మండల తహసీల్దార్ దండు అహల్య అన్నారు. గోల్కొండ మండల తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలానగర్ మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి గోల్కొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అహల్య మాట్లాడుతు.... ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు.

యువత జాబ్ మేళాలను వినియోగించుకోవాలి



అభ్యర్థికి ఆఫర్ లెటర్‌ను అందజేస్తున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

డబీర్‌పురా: నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సూచించారు. పంజేషాలోని గుల్జార్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ పోలీసు, సౌత్ జోన్‌తో కలిసి డెక్కన్ బ్లాస్టర్స్ నిరుద్యోగుల కోసం జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 40కి పైగా కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతీ, యువకులను వారి విద్యార్హతలకు అనుగుణంగా ఎంపిక చేసుకున్నారు. మీర్‌చౌక్ ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్ రావు, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్, ఎస్సైలు, సిబ్బంది, మన్నాన్ ఖాన్, మీర్ బర్కత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 12న చలో హైదరాబాద్



కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు నరేందర్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: దశాబ్ద కాలంగా రాష్ట్రంలోని సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు చేస్తున్న ఆందోళన అంతిమ దశకు వచ్చిందని అభి నహీతో కభి నహీ అనే నినాదంతో టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.నరేందర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రధాన కార్యాలయాల్లో సీపీఎస్ రద్దు అంశంపై నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉద్యోగుల పొట్టలు కొట్టి పెట్టుబడిదారుల పెట్టెలు నింపడానికి పెట్టిన పెట్టుబడిదారి పెన్షన్ విధానం కనీస హామీలేని జీవనదిలాంటిదన్నారు. కార్యక్రమంలో సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కోటకొండ పవన్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, అరవింద్, అంజిరెడ్డి, రెడ్డప్ప, మల్లేష్, ప్రవీణ్, భాస్కర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

25న యాదవ యుద్ధభేరి సభ

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు సముచిత ప్రాధాన్యతను కల్పించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్ నగరంలో యాదవ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన పొలిటికల్ సెంటర్ వ్యవస్థాపక సభ్యులు కె.పర్వతాలు యాదవ్ పాల్గొన్నారు.

అబిడ్స్‌లో సస్పెక్ట్ రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సిములు లు సస్పెక్ట్ రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదులు అందినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బహదూర్‌పుర తహసీల్దార్‌గా కె.చంద్రశేఖర్

దూద్‌బౌలి: బహదూర్‌పురా మండల పరిధిలోని కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలను సకాలంలో అందించి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని బహదూర్‌పురా మండల తహసీల్దార్ కె.చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల బహదూర్‌పురా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జుబేదా బేగం పదోన్నతిపై వెళ్లడంతో ఆమె స్థానంలో రాజేంద్రనగర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.చంద్రశేఖర్‌ను బహదూర్‌పుర తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.